క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నిఖత్ అన్నారు. శనివారం మండలంలోని కుంటాల(కె) గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. దోమల నివారణ కోసం తీసుకోవాలిస్న జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు రమాదేవి, గౌరిబాయి, స్వాతి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ రశీదా

తాంసి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సీఆర్పీ రశీదా సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, సీసీలు మహేందర్, సంతోశ్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న మౌనిష్‌రెడ్డి

సాత్నాల: ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యం చేరుకోవాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జామ్ని పాఠశాలలో విద్యార్థులకు చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకం అందజేయడంతో పాటు, వారి తల్లిదండ్రులను సన్మానించారు. పాఠశాలలో ఉన్న 145 విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్ యాదవ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ దేవుబాయి, పెందోర్ మోహన్, వీరన్న, గోవర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ఆశన్న యాదవ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, జువాలజీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, మైక్రోబయోలజీ, కామర్స్, గణితం, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనమిక్స్ సబ్జెక్టులలో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఈనెల 26న డెమో ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యతనివ్వాలి

కైలాస్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ సీట్ల కేటాయింపులో యువజన సంఘం నాయకులకు తగిన ప్రాధాన్యతనివ్వాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్ గౌడ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ గార్డెన్‌లో స్థానిక ఎన్నికల సన్నద్ధతపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

రేపు ఇసుక వేలం

జైనథ్: పెన్‌గంగా పరివాహక గ్రామమైన ఆనంద్‌పూర్‌లో ఈనెల 18న పట్టుకున్న 14 ట్రాక్టర్ల ఇసుక డంప్‌కు ఈనెల 23న ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు వేలం వేయనున్నట్లు మండల తహసీల్దార్ ఆత్రం నారాయణ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే అభ్యర్థులు రూ.2వేల డీడీ లేదా నగదు రూపంలో చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.



బేల: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఘనంగా యోగా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ప్రపంచ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాలు, రాజకీయ పార్టీ కార్యాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. యోగాసనాలు వేసి యోగా ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నార్నూర్ మండలంలోని మన్కపూర్‌లో ఉపాధిహామీ కూలీలు యోగాసనాలు వేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ శివారులోని 2వ పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన యోగా వేడుకల్లో 2వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్ పాల్గొన్నారు ఇచ్చోడ మండలంలోని అమృత్ సరోవర్‌లో డీఆర్డీవో రాథోడ్ రవీందర్ యోగాసనాలు వేశారు. ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ కాజల్ సింగ్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



బోథ్: వేదం పాఠశాలలో..



ఆదిలాబాద్‌రూరల్: మాట్లాడుతున్న కమాండెంట్ నితిక పంత్



నార్నూర్: యోగా చేస్తున్న ఉపాధిహామీ కూలీలు



నేరడిగొండ: యోగాసనాలు వేస్తున్న శిశుమందిర్ విద్యార్థులు



సాత్నాల: యోగా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



ఉట్నూర్‌రూరల్: యోగా చేస్తున్న బీజేపీ నాయకులు



ఇంద్రవెల్లి: యోగా చేస్తున్న మండలవాసులు



ఇచ్చోడలో పాల్గొన్న డీఆర్డీవో రవీందర్



జైనథ్: యోగా చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జయశంకర్ వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఆయన విగ్రహానికి విశ్వకర్మ సంఘం సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్ర కీలకమైందన్నారు. ఆయన వర్ధంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు రాష్ట్ర జాతిపితగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వరాష్ట్రం కోసం ఉద్యమించిన వారికే తీవ్ర అన్యాయం జరిగిందని, కొంతమందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘుపతి, చిక్కాల దత్తు, నర్సిములు, స్వామి, దశరత్, కిష్టయ్య, నర్సిములు, నరేందర్, తిప్పర్తి సత్యం, అశోక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

జయశంకర్ సార్‌కు నివాళి

ఆదిలాబాద్‌టౌన్: జయశంకర్ సార్ ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. జయశంకర్ సార్ వర్ధంతి పురస్కరించుకుని శనివారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌక్‌లో గల జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు యూనిస్ అక్బానీ, ప్రహ్లాద్, పట్టణ అధ్యక్షుడు అజయ్, అశోక్ స్వామి, అశోక్, పరమేశ్వర్, పురుషోత్తం, దమ్మపాల్, వసంత్ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని అమరవీరుల స్తూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం హార్టికల్చర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్తూపం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అమరవీరుల కుటుంబాలను ఇప్పటికే ఇంటి స్థలాలు ఇచ్చామని, నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయన్నారు. అమరవీరుల స్తూపాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానన్నారు. ముందుగా పిప్రి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. రైతులతో మాట్లాడి భూసమస్యలే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, జహీర్, మసుద్, జితేందర్, మీర్జా యాకుబ్‌బేగ్, కొరెంగా సుంకట్‌రావ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం పని చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, జహీర్, మసుద్, జితేందర్, సుంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, మిర్జ యాకుబ్‌బేగ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం.. రైతు భరోసా ద్వారా ప్రతీ రైతు అకౌంట్‌లో పంట సాయం వేసిన సీఎం రేవంత్‌రెడ్డి రైతుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సొనాల మండల కాంగ్రెస్ నాయకులు గాజుల పోతన్న అన్నారు. ఈ సందర్భంగా సొనాలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేశ్, పట్టణ అధ్యక్షుడు చెట్లపెల్లి అనిల్, రామాయి రాము, విజయ్ భాస్కర్‌రెడ్డి, గోరెబాయ్, ముండె శ్రీధర్, అమృత్‌రావ్, రామారెడ్డి, ఆశన్న పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.36,500 చెక్కును లబ్ధిదారుడు గాదె రవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన ప్రజలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు తోడ్పాటునందిస్తా

• బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: విద్యార్థుల భవిష్యత్‌కు తోడ్పాటునందిస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. కాగా పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. వర్షాకాలంలో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, ఏలేటి రవీందర్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, బాబులాల్, కేజీబీవీ ప్రిన్సిపాల్ రజిత పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రజా సేవ కోసం ఎల్లప్పుడు ముందుండాలి

ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బుగ్గారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు రాథోడ్ సురేందర్ జన్మదినం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి తినిపించారు. ఈ సందర్భంగా రాథోడ్ సురేందర్‌ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమస్యల పరిష్కరం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు.

జయశంకర్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్: తెలంగాణ సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. జయశంకర్ వర్ధంతిని శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లోని సార్ విగ్రహానికి విశ్వబ్రహ్మణ కులస్తులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమైక్య పాలనలో నీళ్లు, నిధులు, నియమాకాల్లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎప్పటికప్పుడు ప్రశ్నించిన వ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌రావు, బీడీ చారీ, రాంచందర్ మహాత్మే, నర్సింగ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

జయశంకర్ చిత్రపటానికి నివాళి

బోథ్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పసుల చంటి, గొర్ల రాజుయాదవ్, మహమ్మద్ అబ్రార్, రవి పాల్గొన్నారు.

కోకస్‌మన్నూర్ గ్రామాభివృద్ధికి కృషి

నేరడిగొండ: ఇచ్చోడ మండలంలోని కోకస్‌మన్నూర్ గ్రామాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఇటీవల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం సహకారం అందించాలని గ్రామస్తుల కోరిక మేరకు శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారికి రూ.2లక్షల ప్రొసీడింగ్ అందజేశారు. దీంతో గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్వర్, మునేశ్వర్ భీమ్‌రావు, పాట్ల గోవర్ధన్, ఆమెరే విష్ణు, పోశెట్టి, యూసుఫ్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటా


ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండలంలోని రోల్‌మామడ (కిష్టాపూర్) పరిధిలోని గురుబాబా మందిరం వద్ద నూతన కాశీయ మాతా ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల ప్రొసీడింగ్ అందజేసి, భూమిపూజ చేశారు. మందిరం నిర్మాణానికి తన చేతుల మీదుగా భూమి పూజ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. నాయకులు ఆడే వసంత్ రావు, నారాయణ సింగ్, నాయక్ ప్రతాప్ సింగ్, కారోబారి అజబ్ సింగ్, బిషన్ సింగ్, కైలాష్ సింగ్, అమర్ సింగ్, కిషన్ సింగ్, మోహన్ సింగ్, మదన్ సింగ్, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బాసన్ దాస్ పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ అందజేస్తున్న ఆడే గజేందర్

పింఛన్ల పంపిణీకి ప్రామాణికం ఇవ్వొద్దు

బేల: స్థానికంగా ఉండని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీకి పోస్టాఫీసుల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు వేలిముద్ర ప్రామాణికం ఇవ్వొద్దని ఎంపీడీవో మహేందర్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో పింఛన్ల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఏళ్లుగా స్థానికంగా ఉండని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ కోసం పంచాయతీ కార్యదర్శులు వారి వేలిముద్ర ఏమాత్రం ఇవ్వకూడదని పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతిపై దృష్టి సారించి, పనులు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో మహేశ్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో మహేందర్‌కుమార్

‘ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యేలా చూడాలి’

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ ప్రకారం కేటగిరీల వారీగా మీసేవా కేంద్రాల ద్వారా ఎస్సీ ధ్రువీకరణ పత్రం జారీ అయ్యేలా చూడాలని ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడ నివాసి, మాదిగ సామాజిక వర్గానికి చెందిన రొడ్డ సాగర్ కోరారు. ఈ విషయంలో తహసీల్దార్‌లను అడిగితే తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. కేటగిరీల వారీగా ధ్రువీకరణ పత్రాలు జారీ కాకపోవడంతో మాదిగ, మాదిగ ఉప కులాలకు చెందిన వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎస్సీ డెవలప్‌మెంట్ కమీషన్‌కు రిజిస్ట్రార్ పోస్ట్ ద్వారా లేఖ రాయడం జరిగిందన్నారు.

ఎస్పీ, డీఎస్పీలకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్ సొసైటీకి సంబంధించిన 4, 5 ప్లాట్స్‌ను ఫేక్ డాకుమెంట్స్‌తో కబ్జాకు ప్రయత్నించిన వారిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ జీవన్ రెడ్డిలను వారి కార్యాలయాల్లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.



ఎస్పీని సన్మానిస్తున్న కాలనీవాసులు

సబ్ కలెక్టర్‌కు..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఉట్నూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ యువరాజన్‌ను ఆర్టీఐ యాక్ట్ ఉట్నూర్ మండల అధ్యక్షుడు బాబా శ్యాం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు.

ఆత్రం సుగుణకు..

ఉట్నూర్‌రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసిన ‘సోయం’

కైలాస్‌నగర్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మాజీ ఎంపీ సోయం బాపూరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



కొనసాగుతున్న పారాయణం

బోథ్: సొనాల మండల కేంద్రంలోని రామాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో ప్రతీ శనివారం నిర్వహించే హనుమాన్ చాలీసా పారాయణం 79 వారాలకు చేరుకుంది. 2023, డిసెంబర్, 23వ ప్రారంభమైన పారాయణం ప్రతీ శనివారం కొనసాగుతోంది.

ఇంగ్లిష్ మీడియం ప్రవేశాలు చేయించాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని గ్రూప్‌లో మొదటి సంవత్సరంలో తెలుగు మీడియంతో పాటు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ మాధ్యమిక అధికారి జాదవ్ గణేష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని లిమ్‌గూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించి విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మారుతి, సూపరింటెండెంట్ మోసిన్, అధ్యాపకులు మాదాసు మధుకర్ పాల్గొన్నారు.



అధ్యాపకులతో సమావేశమైన డీఐఈవో జాదవ్ గణేష్‌కుమార్